క్లుప్తంగా

విరాళం



జనగామ: జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలకు సంబంధించిన 1974–75 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు రూ.50 వేల విరాళాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి చెక్కును అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశాన్ని రాత్రింబవళ్లు కంటికి రెప్పలా నిఘా ఉంచుతూ, కాపాడుతున్న సైనికులకు ప్రతి ఒక్కరు అండగా నిలవడం మనుధర్మం అన్నారు. పూర్వవిద్యార్థులు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. విరాళం అందించిన వారిలో అధ్యక్షుడు దొడ్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బండిరాజుల శంకర్, ఉపాధ్యక్షుడు బచ్చు రమేష్, సహ కార్యదర్శి అల్లాడి మహేశ్వర్, కోశాధికారి సోమ హన్మంతరావు, సభ్యులు అమరేందర్, రాజు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



జనగామ: జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ జమీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3లక్షల ఎల్‌ఓసీ చెక్కును కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్లగా జమీర్ మరణానంతరం ఆస్పత్రికి చెల్లించాల్సిన రూ.3 లక్షలకు ఎల్‌ఓసీ మంజూరు చేయించాడన్నారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించిన మంత్రి, కిరణ్ కుమార్‌కు బాధిత కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో జాతీయ తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ లీస్‌బేత్ జోష్ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు ప్రశంసించారని గుర్తు చేశారు. విద్యార్థులు క్రీడాల్లో రాణించాలని అన్నారు. అనంతరం సెయింట్ ఏఫ్రాసియా ఫీస్ట్‌డే కార్యక్రమం నిర్వహించారు.


కొడకండ్ల: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని అధ్యాపకురాలు స్వప్న ఆధ్వర్యంలో రామమూర్తి చిత్రపటానికి ఎస్‌ఓ జ్యోతి, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

దంసా కాల్వ పరిశీలన



జఫర్‌గఢ్: మండలంలోని దుర్గ్యతండా, కోనాయిచలం గ్రామాల మీదుగా వెళ్తున్న దంసా కాల్వకు మరమ్మతు చేసేందుకు నీటి పారుదల శాఖ ఏఈ వెంకన్ననాయక్ శుక్రవారం పరిశీలించారు. వర్షపు నీరు దంసా చెరువులోకి సాఫీగా రావడం లేదని ఇటీవల తిడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏఈ వెంకన్న నాయక్ క్షేత్ర స్థాయిలో దంసా కాల్వను పరిశీలించారు. మాజీ సర్పంచ్‌లు సంపత్‌రెడ్డి, బాదావత్ దేవి రవినాయక్, అంకేశ్వరపు హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



గుండయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు పడకంటి గుండయ్య (97) శుక్రవారం మృతిచెందారు. తొమ్మిది పదుల వయస్సులోనూ ఆరోగ్యంగా ఉంటూ ప్రతీరోజూ దైవ పూజలు, దైవారాధన చేస్తూ అందరికీ ఆదర్శంగా ఉండే ఆయన శుక్రవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతిపై గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేత్రాల సేకరణ

గుండయ్య మృతిచెందగా కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వరంగల్ రీజియన్ నేత్ర వైద్యశాల డాక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో ఆయన నేత్రాలను సేకరించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణంలో నిర్లక్ష్యం

- ఖాతాల్లో రూ.72 లక్షల నిధులు జమ
- స్థల కేటాయింపులో ఆలస్యం



మండలకేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రం



మండలకేంద్రానికి సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తరిగొప్పుల: మండలకేంద్రంలో రెండేళ్ల కిందటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ నేటికి సైతం పీహెచ్‌సీ నిర్మాణానికి ఇటుక పడలేదు. 20వేలకు పైగా జనాభా ఉన్న తరిగొప్పుల మండలంలో ప్రాథమిక వైద్యశాల లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్న సుస్తి చేసినా నర్మెట మండలంలోని పీహెచ్‌సీకి లేదా దూరాన ఉన్న జనగామ, హనుమకొండలో ఉన్న ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. రూ.కోటి 43 లక్షల నిధులతో పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా రూ.72 లక్షల నిధులు విడుదల అయ్యి సంబంధిత ఖాతాలో జమకావడం జరిగింది.

స్థలం లేకపోవడంతోనే..

మండలంలో పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయినప్పటికీ స్థల కేటాయింపులో ఆలస్యం కావడంతో ఆస్పత్రి నిర్మాణానికి అడుగులు ముందుకు పడడంలేదు. మొదట్లో మండలకేంద్రానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో సర్వేనంబర్ 248లో రెండు ఎకరాల భూమిని పీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయిస్తు రెవెన్యూశాఖ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను అందించారు.ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రైతు వేదిక సమీపంలో సర్వేనంబర్ 275లో 1.12 గుంటల భూమిని కేటాయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మల్లికార్జునరావు రెవెన్యూ అధికారును కోరారు.

మండలకేంద్రానికి చేరువగా ఉండేలా స్థలాన్ని కోరాం



ప్రజలకు చేరువగా ఉండేలా స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరాం. రూ.72 లక్షల నిధులు కూడా విడుదల చేశాం. మడలకేంద్రానికి సమీపంలోని స్థలాన్ని ఇటీవల పరిశీలించాం. రెవెన్యూ స్థలాన్ని కేటాయించగానే పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతాం.

– మల్లికార్జునరావు, డీఎంహెచ్‌ఓ

నిఘా నేత్రాలతోనే నేరాల నియంత్రణ సాధ్యం

- వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య



సీసీ కెమెరా సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ నర్సయ్య

దేవరుప్పుల: వేగవంతమైన జీవితాలతో అనేక తప్పిదాలు చేస్తున్న తరుణంలో నిఘానేత్రాలతోనే పలు రకాల నేరాల నియంత్రణ సాధ్యమని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో స్థానిక వ్యాపారస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన పీటీజెడ్ సీసీ కెమెరా సిస్టమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను పోలీసులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాలకుర్తి సీఐ జానకిరామ్, ఎస్సై ఊర సజన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రదేశాల్లోనే గణేశ్ విగ్రహాల నిమజ్జనం చేయాలి

దేవరుప్పుల: ఆయా గ్రామ పంచాయతీలు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. శుక్రవారం సాయంత్రం దేవరుప్పుల వాగులో గణేశ్ నిమజ్జనం చేసే ప్రదేశాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ టి సురేష్‌కుమార్, సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై ఊర సృజన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మధు ఉన్నారు.

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల: ఊరూరా ఓటరు జాబితాపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన గ్రామ ఇన్‌చార్జీలు, మండల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా రూపాకల్పనలో ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, ఊరూరా ప్రదర్శిస్తున్న ఓటర్ లిస్ట్‌తో ఇంటింటా తిరిగి ఓటు హక్కు ఉందో లేదో అవగాహన కల్పించాలన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, బస్వ మల్లేషమ్,అర్జున్, జోగేష్, ఖాసీమ్, హన్మంతు, సాయిలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో ఫౌండేషన్ ప్రతినిధులు

జనగామ: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూమయ్య జ్ఞాపకార్థం శుక్రవారం విద్యార్థులకు స్కూల్ లెవల్‌లో అండర్– 9, 14 విభాగాల్లో చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు మన్విత్, సాత్విక్, సహస్ర, చేతన్, హశ్విక, సాక్షర ఫైనల్స్‌కి అర్హత సాధించారు. విజేతలకు ఫౌండేషన్‌కో చైర్మన్ శ్రీధర్, సుహాసిని బహుమతులను ప్రదానం చేసి, వారిని అభినందించారు. కాసాల సంతోష్ కుమార్ పర్యవేక్షణలో చెస్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే ఎస్సీ కాలనీల అభివృద్ధి

రఘునాథపల్లి: కాంగ్రెస్‌తోనే ఎస్సీ కాలనీల అభివృద్ధి సాధ్యమని మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపూర్ ఎస్సీ కాలనీలో గ్రామ పెద్దలతో కలిసి రూ.12 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల వైఫల్యంతో ఎస్సీ కాలనీలు అధ్వానంగా మారాయన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ఎస్సీ కాలనీలన్నింటా సీసీ రోడ్లు వేస్తామన్నారు. గ్రామ పెద్దలు లింగాల వంశీచందర్‌రెడ్డి, చింత యాదగిరి, కాంగ్రెస్ నాయకులు పోకల శ్రీనివాస్, చింత నరేష్, ఎండి గౌస్, మేడిపల్లి నరేష్, నోముల సత్తయ్య, మాటూరి పోశెట్టి, దొరగొల్ల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న ధారాసింగ్‌నాయక్

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా యోజన పథకాలను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మెనేజర్ ధారాసింగ్‌నాయక్ సూచించారు. శుక్రవారం కంచనపల్లి సెంట్రల్ బ్యాంకులో ఆయన మహిళా సంఘాలకు రూ.2 కోట్ల రుణాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులకు బీమా పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. వరంగల్ రీజనల్ మెనేజర్ బి కృష్ణమోహన్, చీఫ్ మెనేజర్లు సాయికుమార్, ఎండీ ముస్తఫా, బ్రాంచ్ మెనేజర్ యు ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ మెనేజర్ వేణుమాధవ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

యాదగిరిగౌడ్ సేవలు ఎనలేనివి



యాదగిరిగౌడ్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రఘునాథపల్లి: విద్యార్థుల విద్యా అభ్యున్నతి కోసం ఉపాధ్యాయుడిగా కుర్రెముల యాదగిరిగౌడ్ అందించిన సేవలు ఎనలేనివని రాష్ట్ర ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలగూడెం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన యాదగిరిగౌడ్–మాధవి దంపతులను శుక్రవారం ఉపాధ్యాయులు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం నాగవెల్లి రాజ్‌పాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. ఎంఈఓలు రఘునందన్‌రెడ్డి, అయిలయ్య, విష్ణుమూర్తి, లయన్స్ పూర్వ గవర్నర్ కన్న పరశురాములుగౌడ్,పెద్ది వెంకటనారాయణగౌడ్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎ రాజు, స్కూల్ కాంప్లెక్ హెచ్‌ఎం భారత రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉత్తెపు ఉమా రాణిసత్యనారాయణ, గోపా జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు నేడు చివరి తేదీ

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను శనివారం నాటికి చివరి తేదీ అని ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు మిగిలిపోయిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు బాలికలకు హాస్టల్ సదుపాయం కలదని, అవసరమగు వారు వెంటనే సంప్రదించాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పలు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ భారతీ దేవి తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పలు సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్ కోసం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఇంగ్లిష్, నర్సింగ్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ మహిళా టీచర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రత్యేక అధికారి నారమల్ల గీత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇంగ్లిష్ బోధించేందుకు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేసి ఉండాలని, నర్సింగ్ కోసం బీఎస్సీ నర్సింగ్ లేదా పీజీ నర్సింగ్ చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పండుటాకుల కష్టాలు



పింఛన్ల కోసం బారులుదీరిన వృద్ధులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ నెలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందించే పింఛన్ కోసం లబ్ధిదారులు ప్రతీ నెలా అరిగోస పడుతున్నారు. స్థానిక పోస్టల్ అధికారుల నిర్లక్ష్యంతో పండుటాకులు మండుటెండలో అరిగోస పడుతున్నారు. డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో ఉండగా స్థానిక మున్సిపాలిటీలో కేవలం ఒక్క పోస్టల్ సిబ్బంది ద్వారా పింఛన్లు అందిస్తుండగా లబ్ధిదారులు గంటల తరబడి నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో సక్రమంగా పింఛన్లు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కొడకండ్ల: క్రీడా దినోత్సవంలో హెచ్‌ఎం, టీచర్లు

కొడకండ్ల: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడలపై దృష్టి సారించి రాణించాలని హెచ్‌ఎం నారబోయిన యాకయ్య కోరారు. శుక్రవారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏడునూతుల ఉన్నత పాఠశాలలో పీడీ రజిత ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కూనూర్, తిమ్మంపేట స్కూళ్లలో..

జఫర్‌గఢ్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని కూనూర్, తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు రాంమ్మూర్తి, కాసర్ల రమేష్‌బాబు, ఫిజికల్ డైరక్టర్ సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి



పూజలు చేస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

లింగాలఘణపురం/నర్మెట/బచ్చన్నపేట/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల: గణేశ్ నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశించారు. శుక్రవారం లింగాలఘణపురం మండల కేంద్రంలోని గణేశ్ మండపాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మాట్లాడుతూ గణేశ్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పలు మండలాల్లో మండపాల వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు, నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న సుప్రీంకోర్టు లాయర్

జనగామ: పట్టణంలోని 27వ వార్డు యూత్ గణేశ్, సైనిక్ యూత్ మండపం వద్ద కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని సుప్రీం కోర్టు లాయర్ క్రాంతికుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఉత్సవ సమితి ప్రతినిధులు లాయర్‌కు స్వాగతం పలుకగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.

పరిశుభ్రత పాటించాలి



జనగామ రూరల్: వృద్ధాశ్రమంలో పరిశుభ్రతను పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి పట్టణంలోని గిర్నిగడ్డలోని రాజేశ్వరి సేవాసదన్ అనాథ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులను పలకరించి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో దుర్వాసన రావటంపై అక్కడ ఉన్న సిబ్బందిని, నిర్వాహకులను మందలించారు. ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి, వలంటీర్ శేఖర్, జితేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూరియా తిప్పలు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. కేవలం ఒకటి, రెండు బస్తాల కోసం స్థానిక ఆగ్రోస్ సెంటర్ వద్ద గంటల తరబడి బారులు తీరి నిలబడాల్సి వస్తోంది. మండుటెండలో గంటల తరబడి క్యూలో నిలబడినా యూరియా బస్తాలు దొరకక రైతులు నిరాశగా వెనుతిరుగుతున్నారు. శుక్రవారం ఆగ్రోస్ సెంటర్‌కు 110 బస్తాల స్టాక్ రాగా రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. స్టాక్ పరిమితంగా ఉండటం, రైతులు పెద్ద సంఖ్యలో రాగా గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు పడ్డారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సుమ

బచ్చన్నపేట: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కార్యదర్శి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్నారని, ఇంత వరకు ఈ శాఖకు మంత్రి లేక పోవడమే నిదర్శనమన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పాదల లవకుమార్, ఉపాధ్యక్షుడు యాకన్నా రాథోడ్, ఆర్య, అరవింద్, రాకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అసైన్డ్ భూమి స్వాధీనం

జనగామ రూరల్: మండలంలోని పెద్దరామ్‌చర్ల గ్రామంలో 17 గుంటల అసైన్డ్ భూమి స్వాధీనం చేసుకున్నామని జనగామ తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దరాంచర్ల గ్రామంలోని జిట్ట కిష్టయ్య గతంలో గ్రామానికి చెందిన మరో వ్యక్తికి చెందిన సర్వేనెంబర్ 130లోని 17 గుంటల అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి ఎలాంటి రెగ్యులేషన్ లేకుండా అక్రమంగా పట్టా చేయించుకున్నాడు.ఈ విషయమై గ్రామానికి చెందిన ఏళ్ల నరసింహారెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో లోకాయుక్త తీర్పు మేరకు ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ బోర్డు తీసేసి అక్రమంగా ప్రభుత్వ భూమిలో పంటవేసిన కిష్టయ్య కుమారుడు జిట్టా వెంకటేశ్వర్లుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు

కొడకండ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం రామవరం గ్రామ మాజీ వార్డు సభ్యుడు తోట మురళీ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

స్థానిక ఎన్నికల కోసం సన్నద్ధం కావాలి

దేవరుప్పుల: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ టీ పాయింట్ వద్ద పార్టీ శ్రేణులతో మాట్లాడారు. చాపకింద నీరులా ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధమవుతూనే ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సుందర్ రామిరెడ్డి, దయాకర్, మల్లేషమ్ ఉన్నారు.

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరం రాము, వెంకటేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని పార్టీ మండల నాయకుడు కటారి పాపారావు అన్నారు. తీగారం గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కొండయ్య, పరశరాములు, సోమయ్య, గోపి పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతో రైతులకు మేలు

జఫర్‌గఢ్: నానో యూరియా వాడకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ కార్యాలయం వద్ద నానో యూరియా వాడకంపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని యూరియా కొరత లేదని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు రైతులు పాన్నారు.

కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్: దిశ కమిటీ మెంబర్ బక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్వరరెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం పట్టణంలో పేరుకుపోయిన సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్దిరాములు, నాయకులు మోర్తాల ప్రభాకర్, నోముల రాజు, సేవాదళ్ అధ్యక్షుడు బిర్రు సత్యనారయణ, సిద్దులు పాల్గొన్నారు.

బ్రాస్‌బ్యాండ్ బహూకరణ

పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి జెడ్పీ ప్రాథమిక పాఠశాలకు జలగం కృష్ణ.. బ్రాస్ బ్యాండ్, డస్ట్‌బిన్‌లను బహూకరించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ వెంకటేశం మాట్లాడుతూ గ్రామానికి చెందిన కృష్ణ బ్రాస్‌బ్యాండ్, డస్ట్‌బిన్‌లను అందజేయడం అభినందనీయమన్నారు. అలాగే పాఠశాలకు చెందిన రజిత టై, బెల్టులు, ఐడీ కార్డులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, పాపయ్య, సోంమల్లయ్య, ఉప్పలయ్య, ఝాన్సీ, నాగజ్యోతి, క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితాపై ప్రత్యేక సమావేశం

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ ఎన్నికలు–2025కు సంబంధించిన వార్డుల వారీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై చర్చించేందుకు నేడు(శనివారం) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

పరామర్శ

బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీపీ మల్టీపర్పస్ ట్రాక్టర్ డ్రైవర్ జక్కుల అంజయ్య కుటుంబాన్ని ఎంపీడీఓ వెంకమల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్, గ్రామ స్పెషలాఫీసర్ శంకర్‌లు శుక్రవారం పరామర్శించారు. అంజయ్య మృతదేహంపై పూల మాలను వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలకు రూ. 10 వేలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి, పలువురు జీపీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి పసాదం రమేశ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక పోవడంతో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోడటంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు.

దళితుల మానవతా దృక్పథం



దేవరుప్పుల: ఓ మహిళ అనాథగామారి వృద్ధాశ్రమంలో తుది శ్వాస వీడగా, మానవతాదృక్పథంతో దళితులు ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన చిలుమోజు యాదగిరి రెండో భార్య శివమాల (75) కుటుంబ పరిస్థితులతో సీతారాంపురం ప్రేమసదన్ అనాథ శరణాలయంలో ఉంటోంది. ఇటీవల ఆమె అనారోగ్యం క్షీణించి శుక్రవారం మరణించగా మండల కేంద్రానికి చెందిన దళితులు ఏక మై అంత్యక్రియలు నిర్వహించారు. అనాథ వృద్ధురాలి అంత్యక్రియలను ఉచితంగా చేయడం పట్ల శరణాలయ నిర్వహకులు, గ్రామస్తులు అభినందించారు.

నివాళి

లింగాలఘణపురం: చీటూరు మాజీ సర్పంచ్ ఉప్పల భిక్షపతి (65) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి చేరుకుని భిక్షపతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గోదాముల తనిఖీ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణాల గోదాములను శుక్రవారం మండల వ్యవసాయాధికారి శరత్‌చంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరత ఏర్పడడంతో ప్రైవేట్ ఎరువుల దుకాణాల గోదాముల్లో యూరియా బస్తాల నిల్వలు ఉన్నాయా అని తనిఖీ చేసినట్లు తెలిపారు.

'స్థానికం' హస్తగతం కావాలి

దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ హస్తగతం కోసం పాటుపడాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం రామరాజుపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.